


చీనీ టన్ను రూ.33,190
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33,190, కనిష్టంగా రూ.12 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.17
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.17, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
32.5°/15.9°
జిల్లాలో చలి వాతావరణం కొనసాగుతోంది. సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

తూకంలో మోసం

- మొక్కజొన్న వ్యాపారి గోపాల్‌పై కేసు నమోదు



రిమోట్ కంట్రోల్ ద్వారా తూకంలో మోసం ఎలా చేస్తారో తెలియజేస్తున్న అధికారులు

పరిగి: ఎలక్ట్రానిక్ కాటాతో తూకంలో మోసం చేస్తున్న శ్రీరంగరాజుపల్లికి చెందిన మొక్కజొన్న కమీషన్ ఏజెంట్ గోపాల్‌పై తూ.కొ.శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన మొక్కజొన్న కమీషన్ ఏజెంట్ ఉప్పర గోపాల్ కొన్నేళ్లుగా మొక్కజొన్న వ్యాపారాన్ని చేస్తున్నాడు. ఆదివారం పరిగి రైతు రాజీవ్‌రెడ్డికి చెందిన మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అప్పటికే రైతు రాజీవ్‌రెడ్డి తన దగ్గర ఉన్న స్కేలుపై 50 కేజీలకు పైగా తూకం పెట్టి, సంచుల్లో మొక్కజొన్న విత్తనాలు నింపాడు. అయితే గోపాల్ తెచ్చుకున్న ఎలక్ట్రానిక్ స్కేలుతో తూకం వేయగా తక్కువగా చూపాయి. ఇలా క్వింటాకు 20 కేజీలు తక్కువగా చూపడంతో రైతు రాజీవ్‌రెడ్డికి అనుమానం వచ్చింది. దీంతో అతను పరిశీలించగా...కమీషన్ ఏజెంట్ గోపాల్ తన ప్యాంటు జేబులో రిమోట్ ద్వారా ఎలక్ట్రానిక్ కాటాను ఆపరేట్ చేస్తూ తక్కువ తూకం చూపుతున్నట్లు గుర్తించాడు. ఇదే విషయాన్ని ప్రశ్నించగా గోపాల్ అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో గోపాల్‌పై పరిగి పోలీస్‌స్టేషన్‌లో రైతు రాజేష్ రెడ్డితో పాటు మండలంలోని పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. అలాగే హిందూపురం తూనికల కొలతల శాఖ అధికారి శివశంకర్‌కూ ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం పరిగికి వచ్చిన ఆయన... గోపాల్‌ను స్టేషన్‌కు పిలపించి విచారించారు. ఎలక్ట్రానిక్ స్కేలుపై ఉంచిన ధాన్యాన్ని తూకం కంటే అధికంగా సేకరించే విధానాన్ని రిమోట్ ద్వారా ఎలా చేపట్టాడన్నది స్వయంగా గుర్తించారు. అనంతరం గోపాల్‌పై కేసులు నమోదు చేశారు. ఎక్కడైనా తూనికలు, కొలతల్లో తేడా వస్తే 79890 05014 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



అబల.. ఆక్రందనపర్వమిలా..

☛ గత ఆగస్టులో హిందూపురం మండలం తూమకుంట చెక్‌పోస్టు సమీపాన పెన్నానదిలో మద్యం మత్తులో ఏడేళ్ల చిన్నారిపై వరుసకు పెద్దనాన్న అయ్యే వ్యక్తి అత్యాచారం చేసి, చంపి అక్కడే ఇసుకలో పూడ్చేశాడు. ఈ ఘటన కలకలం రేపింది.

☛ గత అక్టోబర్‌లో విజయదశమి పండుగ రోజున హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో ఇద్దరు మహిళలపై ఆరుగురు యువకులు గ్యాంగ్‌రేప్ చేశారు. వారం రోజుల వ్యవధిలో నిందితులందరినీ పోలీసులు పట్టుకున్నారు. అందరూ నేర చరిత్ర ఉన్నోళ్లే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది.

☛ ఈ నెల 4వ తేదీన పుట్టపర్తి మండలం బత్తలపల్లి గ్రామంలో పదేళ్ల బాలికపై 40 ఏళ్ల వ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. పాఠశాల నుంచి ఇంటికొచ్చిన బాలికపై ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి మద్యం మత్తులో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అయితే బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల ప్రజలు అప్రమత్తం కాగా, వెంటనే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

☛ సోమందేపల్లిలోని స్నేహలత నగర్‌కు చెందిన ఓ వ్యక్తి 9వ తరగతి చదివే విద్యార్థినిపై కన్నేసి కొన్ని రోజులుగా లైంగికంగా వేధించిన ఘటన ఈ నెల 14న వెలుగుచూసింది. మొబైల్ నంబర్‌కు అసభ్యకర మెసేజీలు చేస్తుండటంతో బాలిక ఇంట్లో చెప్పుకోలేక ఆత్మహత్యాయత్నం చేసింది.

...ఇలా జిల్లాలో ప్రతిరోజూ ఏదో ఒకచోట అఘాయిత్యాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. నిందితులను అరెస్టు చేసినా వెంటనే బెయిల్‌పై వచ్చేసి దర్జాగా తిరుగుతున్నారు. ఫలితంగా జిల్లాలో అఘాయిత్యాలకు అంతేలేకుండా పోతోంది.

- జిల్లాలో బాలికలు, మహిళలకు రక్షణ కరువు
- బయటకు వెళ్లేందుకు జంకుతున్న వైనం
- గ్యాంగ్‌రేప్, రేప్, దబాయింపు, దాడులతో బెంబేలు



పెన్నానదిలో చిన్నారిని పూడ్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలో చిన్నారులు, మహిళలకు రక్షణ లేకుండాపోయింది. హిందూపురం, చిలమత్తూరు, పుట్టపర్తి, సోమందేపల్లి.. ఇలా ప్రతిచోటా మహిళలు, బాలికలపై చోటు చేసుకుంటున్న సంఘటనలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. హత్యలు, అరాచకాల సంగతి పక్కనబెడితే సమాజంలో మహిళలు, బాలికలకు భద్రత లేకుండా పోయింది. రేప్‌లు, గ్యాంగ్ రేప్‌లు, కలకలం రేపుతున్నాయి. ఏ ఊర్లో ఎలాంటి ఘటన చోటు చేసుకుంటుందో అర్థం కాని పరిస్థితి. డ్రోన్ కెమెరాలతో మారుమూల ప్రాంతాల్లోనూ నిఘా అంటూ పోలీసులు చెబుతున్నా..ఊళ్లలోనే అఘాయిత్యాలు జరుగుతున్నాయి. దుర్మార్గాలను పీచమణచేందుకు పోలీసులు లాఠీ ఎత్తేందుకు సిద్ధమైనా... కూటమి నేతల ఒత్తిళ్లతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. ఒకిరిద్దరు అధికారులు కాస్త కఠినంగా వ్యవహరించగా.. వారికి బదిలీ బహుమానం అందడంతో మిగతా వారు తమకెందులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

బయటికెళ్లాలంటే భయం భయం..

మహిళలు, చిన్నారులు ఒంటరిగా బయట తిరగాలంటే భయ పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్కూలుకు వెళ్లి తిరిగి వచ్చే లోపు ఏం జరుగుతుందో తెలియని దుస్థితి. బాలికలపైనా మృగాళ్లు అత్యాచారాలకు తెగబడుతున్నారు. ఇంటికే పరిమితమైన వారికీ రక్షణ లేకుండా పోయింది.

జూన్ 4 నుంచి డిసెంబర్ 15 వరకు జిల్లాలో నేరాలు ఇలా..	
నేరం	కేసుల సంఖ్య
హత్యలు	9
అత్యాచారాలు	27
కిడ్నాప్	6
దౌర్జన్యాలు	18

ఇళ్లలోకి దూరి గ్యాంగ్ రేప్‌లు చేస్తున్నారు. దుర్మార్గులను పోలీసులు పట్టుకున్నా.. అంతలోనే అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. ఫలితంగా ఎన్నో కేసులు బయటికి రాకుండా కప్పేశారు. అక్కడక్కడా ఒకటీ అర బయటికి వచ్చినా.. ప్రాధాన్యం లేని సెక్షన్లు విధించి వెంటనే బెయిల్ వచ్చే మార్గం వెతుకుతున్నారు.

ఉపేక్షించేది లేదు



మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఎక్కడైనా దాడులు, లైంగిక వేధింపులు జరిగినా ఉపేక్షించేది లేదు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టానికి అతీతులు కారు. ఎక్కడ దాక్కున్నా.. పట్టుకుంటాం. పోలీసులు భౌతికంగా వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్‌లను పంపించి గాలిస్తాం. నేరస్తుల వెనుక ఎంతటి వ్యక్తులు ఉన్నా.. కేసులు నమోదు చేస్తాం. మహిళలు, చిన్నారుల జోలికొస్తే ఖబడ్దార్.

– వి.రత్న, ఎస్పీ

నిఘా పటిష్టం చేయాలి

- ముందస్తు చర్యలతో శాంతిభద్రతలను పరిరక్షించాలి
- గోరంట్ల పోలీసులకు ఎస్పీ రత్న ఆదేశం



సీఐ శేఖర్‌తో కేసుల గురించి చర్చిస్తున్న ఎస్పీ రత్న

గోరంట్ల: గ్రామాల్లో నిఘా పటిష్టం చేసి ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ రత్న ఆదేశించారు. సోమవారం ఆమె గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పోలీసు స్టేషన్ పరిసరాలతో పాటు రిసెప్షన్ కౌంటరు, కంప్యూటర్ గదిని పరిశీలించారు. కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తు, సిబ్బంది పనితీరు గురించి సీఐ బోయ శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. చోరీల నియంత్రణకు రాత్రి వేళల్లో గస్తీలు ముమ్మరం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సీఐని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. విలేజ్ పోలీసు అధికారులు ఆయా గ్రామాల్లోని సమస్యాత్మక వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. అంతకుముందు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఐ శేఖర్ తన సిబ్బందితో కలిసి పాలసముద్రం సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లించండి

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు డిసెంబర్ 31వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ కృష్ణప్ప సూచించారు. ఆ తర్వాత అపరాధ రుసుంతో జనవరి 10వ తేదీ వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 23 నుంచి 31వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చన్నారు. జనవరి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు రూ.25, 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రూ.50 మేర అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. జనవరి 9, 10వ తేదీల్లో ఫీజు చెల్లించే ఇంటర్ విద్యార్థులు రూ.1,000, పదో తరగతి విద్యార్థులు రూ.500 అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరీక్ష ఫీజు, ఇతర వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్ చూడాలన్నారు.

కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోండి

- సహకరించిన రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలి
- కలెక్టరేట్ ఎదుట నార్శింపల్లి తండా వాసుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నార్శింపల్లి తండావాసులు

ప్రశాంతి నిలయం: దశాబ్దాలుగా తాము నివాసం ఉంటున్న స్థలాన్ని కబ్జా చేసి ఆన్‌లైన్‌లో పేర్లు మార్చుకున్న వారితో పాటు వారికి సహకరించిన రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నార్శింపల్లితండా వాసులు డిమాండ్ చేశారు. సోమవారం తండావాసులు కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, బుక్కపట్నం మండలం కొత్తకోట రెవెన్యూ గ్రామ పరిధిలోని నార్శింపల్లి తండా సర్వే నంబర్ 1030-2వ లెటర్‌లోని 5 ఎకరాలు భూమిని 1995లో అప్పటి ప్రభుత్వం తమకు ఇంటి పట్టాలు ఇవ్వగా, తాము ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నామన్నారు. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్తకోటకు చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ నగరి రాజేష్ బుక్కపట్నం తహసీల్దార్ షాబుద్దీన్, కిందిస్థాయి సిబ్బందితో కుమ్మక్కై తమ భూములు కబ్జా చేశాడన్నారు. రెవెన్యూలోని లొసుగులను ఆసరాగా చేసుకుని ఆన్‌లైన్ పేర్లు మార్పుచేసుకోవడంతో పాటు తాముంటున్న స్థలాలకు 1-బీ, పాసుబుక్కు చేయించుకున్నారన్నారు. ఈ విషయం పత్రికల్లో వచ్చినా రెవెన్యూ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదని వాపోయారు. కబ్జాదారులతో కుమ్మక్కైన రెవెన్యూ అధికారులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వెంటనే స్పందించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, టీడీపీ నాయకులు నగిరి రాజేష్ పేరిట మంజూరు చేసిన ఆన్‌లైన్ రికార్డును, 1-బి, పాసుస్తకాలను రద్దు చేయాలన్నారు. అలాగే రాజేష్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కలసి, విషయాన్ని వివరిస్తూ ఆధారాలను చూపించారు. కార్యక్రమంలో నార్శింపల్లి తండాకు చెందిన వందమందికిపైగా పాల్గొన్నారు.

రక్షణ లేకుండా పోతోంది

అధికారులు, టీడీపీ నాయకులు కుమ్మక్కై నార్శింపల్లిలో మేము నివసిస్తున్న స్థలాలు కబ్జా చేశారు. పేద గిరిజనులకు రక్షణ కరువైంది. అధికారం అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారు. కలెక్టర్ చర్యలు తీసుకుని మా స్థలాలు మాకు దక్కేలా చూడాలి.

– కస్తూరి బాయి, నార్శింపల్లి తండా

చర్యలు తీసుకునే వారే లేరు

పేదల భూములను రక్షించాల్సిన రెవెన్యూ అధికారులే ఇష్టానుసారం మా భూములను వేరే వాళ్లకు రాసిస్తుంటే మేము ఎక్కడికి వెళ్లాలి. ఇంత జరుగుతున్నా అన్యాయం చేసిన వారిపై చర్యలు తీసుకునే వారే లేకుండా పోయారు. ఇప్పటికైనా మా భూములు కబ్జా చేసిన వారిని, వారికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలి.

– రూల్పి బాయి, నార్శింపల్లి తండా

అమరావతిలో ధర్నా చేస్తాం

నార్శింపల్లి తండా వాసులకు జరిగిన అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లాం. ఇప్పటికీ అధికారులు స్పందించకపోతే అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం. మా తండాను కబ్జా చేసిన వారిని శిక్షించే వరకు పోరాడతాం.

– చంద్రబాన్ నాయక్, నార్శింపల్లి తండా

సమస్యను గ్రామస్థాయిలోనే పరిష్కరించాలి

- 'పరిష్కార వేదిక'లో అందే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి
- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ''ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రతి సోమవారం గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తున్నాం. కానీ ఎందుకనో చిన్న చిన్న విషయాలకూ ప్రజలు కలెక్టరేట్ వరకూ వస్తున్నారు. ఇక నుంచి అలా జరగకూడదు. సమస్యలకు గ్రామస్థాయిలోనే పరిష్కారం చూపాలి. అక్కడ సాధ్యం కానివి మాత్రమే కలెక్టరేట్ వరకూ రావాలి. అందుకు అధికారులంతా చిత్తశుద్ధితో కృషి చేయాలి'' అని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 246 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ చేతన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల నుంచి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి పడేలా పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బయోమెట్రిక్ హాజరు అమలుపై ఆయా శాఖల అధిపతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఎస్‌డీసీ సూర్యనారాయణరెడ్డి, సీపీఓ విజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి వైపీ సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సంజీవయ్య, కదిరి ఆర్డీఓ వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నిర్మలాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై దృష్టి సారించాలి

రెవెన్యూ అధికారులు భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో భూ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని, అత్యధికంగా పెనుకొండ డివిజన్ నుంచి వస్తున్నాయన్నారు. అర్థిక పరమైన, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని తప్పించి మిగతా వాటన్నింటికీ పరిష్కారం చూపాలన్నారు. ఏదైనా అర్జీకి పరిష్కారం చూపకుండానే సమస్య పరిష్కారమైనట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసినా, సంబంధం లేని సమాధానాలు ఇచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేవలు పౌరుల ముంగిళ్లలో అందించాలి..

ప్రభుత్వ సేవలను పౌరుల ఇళ్ల ముంగిళ్లలోనే అందించాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. ఇదే లక్ష్యంతో కేంద్రం 'ప్రశాసన్ గావ్ కి ఒరే' కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'గ్రామాల వైపు పరిపాలన -2024' అంశంపై సమీక్షించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారం, సేవలు మెరుగుపర్చడం కోసం కేంద్రం దేశవ్యాప్తంగా డిసెంబర్ 19 నుంచి 24వ తేదీ వరకు 'ప్రశాసన్ గావ్ కి ఒరే' కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.

నాడు ప్రజల కోసం..



2024 ఫిబ్రవరి 12: ధర్మవరంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, డీటీసీ కరుణసాగర్‌రెడ్డి స్థానిక మార్కెట్‌యార్డులో ఆర్టీఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. ధర్మవరం వాసులు కదిరి, అనంతపురం వెళ్లకుండా స్థానికంగానే ఆర్టీఓ సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

ఆర్టీఓ కార్యాలయం.. అ'సత్య' ప్రచారం..!

ధర్మవరం ఆర్టీఓ కార్యాలయం గతంలోనే ఏర్పాటై ప్రారంభం కాగా, అప్పట్లో రవాణాశాఖ అధికారులు సెబ్ విధులు కూడా చూసే వారు. ఈ క్రమంలో ఆర్టీఓ సేవలకు సంబంధించిన కోడ్ మంజూరు కాలేదు. అయినప్పటికీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రభుత్వాన్ని ఒప్పించి తాత్కాలికంగా కదిరి ఆర్టీఓ కోడ్ 8302తో వారానికి రెండు రోజులు ధర్మవరంలో ఆర్టీఓ కార్యకలాపాలు జరిగేలా చూశారు. అయితే ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో ఆర్టీఓ కోడ్ రావడం జాప్యమైంది. తాజాగా అప్పట్లో ఏర్పాటైన ఆర్టీఓ కార్యాలయానికి ధర్మవరం కోడ్ 80602ను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తామే ధర్మవరానికి ఆర్టీఓ కార్యాలయాన్ని తెచ్చినట్లుగా సోమవారం మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సత్యకుమార్‌తో పాటు కూటమి నేతలు గొప్పలు పోవడాన్ని ప్రజలే తప్పుబట్టారు. – ధర్మవరం

నేడు ప్రచార పర్వం



2024 డిసెంబర్ 23: మంత్రి సత్యకుమార్, కూటమి నేతలు ధర్మవరం ఆర్టీఓ కార్యాలయంలో సేవలకు సంబంధించిన కోడ్‌ను ప్రారంభించారు. అయితే ఆర్టీఓ కార్యాలయం తామే మంజూరు చేయించినట్లు గొప్పలు చెప్పుకున్నారు.

క్లుప్తంగా

‘ఆంధ్రా’ ఎదురీత

- పటిష్ట స్థితిలో మహారాష్ట్ర జట్టు



సుప్రుత్ సావంత్ (130 పరుగులు)

అనంతపురం: బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అండర్–19 కూచ్‌బెహర్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భాగంగా రెండో రోజు సోమవారం బ్యాటింగ్ బరిలో దిగిన మహారాష్ట్ర జట్టు పటిష్ట స్థితికి చేరుకుంది. మిడిల్‌ఆర్డర్ బ్యాటర్ సుప్రుత్ సావంత్ 372 బంతుల్లో 18 ఫోర్లతో 130 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. దీంతో రెండో జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు 143.4 ఓవర్ల వద్ద 420 పరుగులు సాధించి తన ఆధిపత్యం ప్రదర్శించింది. ఆంధ్రా బౌలర్ ఎం. యువన్, ఆదిత్యరెడ్డి చెరో మూడు వికెట్లు తీసుకున్నారు. ఎస్.రాజేష్ రెండు వికెట్లు కైవసం చేసుకోగా, బి.యశ్వంత్, ఏఎస్‌పీ లోహిత్ చెరో వికెట్ కైవసం చేసుకున్నారు. అనంతరం భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు కేవలం 34 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసింది. జట్టులో వరుణ్ సాత్విక్ 33 పరుగులు చేసి నాటౌట్‌గా బరిలో ఉన్నాడు. లోహిత్ లక్ష్మీనారాయణ 28 పరుగులు చేశాడు. మూడో రోజు ఆంధ్ర జట్టు ఆలౌట్ కాకుండా వికెట్లు కాపాడుకుంటే మ్యాచ్ నిలుపుకునే అవకాశం ఉంది.

వక్క చెట్లు దగ్ధం



కాలిపోయిన వక్క చెట్లు

అమరాపురం: మండలంలోని ఉప్పార్లపల్లికి చెందిన మహిళా రైతు జుంజమ్మ తన పొలంలో సాగు చేసిన వక్కచెట్లు మంటల్లో కాలిపోయాయి. తనకున్న రెండు ఎకరాల పొలంలో బోరు బావి ఏర్పాటు చేసుకుని మూడేళ్ల క్రితం వక్క సాగు చేపట్టింది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పు రవ్వలు ఎగిసి కిందనున్న ఎండుగడ్డిపై పడ్డాయి. దీంతో మంటలు చెలరేగాయి. వక్క చెట్లు, డ్రిప్పు పరికరాలు కాలిపోయాయి. దాదాపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

టీడీపీ మద్దతుదారుల దాడిలో పలువురికి గాయాలు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం బిట్రగుంట పల్లిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై ఆదివారం పొద్దుపోయిన తర్వాత కొత్తకోటకు చెందిన టీడీపీ మద్దతుదారులు దాడి చేశారు. ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో కుండ్ల యల్లప్ప, సాయి, నాగలక్ష్మి, ఉత్తప్ప ఉన్నారు. గంగాధర్, కేశవయ్యకు స్వల్పగాయాలయ్యాయి. వీరు ఇళ్ల వద్ద పనులు చేసుకుంటున్న సమయంలో కొత్తకోటకు చెందిన టీడీపీ మద్దతుదారులు మల్లికార్జున, గంగన్నతో పాటు మరో 13 మంది పక్కా ప్రణాళికతో దాడులకు తెగబడ్డారు. ఘటనపై సోమవారం ఉదయం క్షతగాత్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రశ్నించు.. పరిహారం పొందు

విక్రయాల ప్రయాణంలో అడుగడుగునా మోసాలే. కళ్ల ముందే తూకాల్లో మోసం జరుగుతున్నా.. అవగాహన లేమితో ప్రశ్నించలేని పరిస్థితి. యాంత్రిక జీవనానికి అలవాటుపడి వస్తు కొనుగోలు సమయంలో తాము మోసపోతున్నామని తెలిసినా పట్టించుకోని విద్యావంతులు... మేధావులు. సమాజంలో పామరులైనా... మేధావులైనా ఒక్కటే. ప్రజల కష్టార్జితాన్ని కొల్లగొట్టడానికి మోసాల విపణిలో అడుగడుగునా గద్దలాడుతున్నాయి. కంటి ముందే కొనుగోలుదారుల డబ్బును తన్నుకు పోతున్నాయి. ఇలాంటి తరుణంలో వస్తు సేవల్లో లోపాలపై వినియోగదారులకు న్యాయం చేసేందుకు అందుబాటులోకి వచ్చిన చట్టాలు, కమిషన్‌పై ప్రజలను చైతన్య పరిచేందుకు వినియోగదారుల చట్టం అమలులోకి వచ్చిన డిసెంబరు 24న ‘వినియోదారుల దినోత్సవం’ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం వారోత్సవాల ముగింపు సందర్భంగా ‘సాక్షి’ ప్రత్యేక కథనం.

- విపణిలో అడుగడుగునా మోసమే
- చట్టాలు తెలుసుకుంటేనే విజయం
- బాధితులకు సత్వర న్యాయం చేకూరుస్తున్న వినియోగదారుల కమిషన్

సందర్భం : నేడు వినియోగదారుల దినోత్సవం



అనంతపురం/కల్చరల్: వినియోగదారులకు తగిన రక్షణ కల్పించి వారు ఏ విధంగానూ మోసపోకుండా ఉండేందుకు వినియోగదారుల రక్షణ చట్టం–2019 ఎంతో ఉపయోగపడుతోంది. ఈ చట్టంపై ప్రజల్లో చైతన్యం కలిగించడానికి జిల్లాలో దశాబ్దాల క్రితం దాదాపు 58 గుర్తింపు పొందిన సంఘాలు ఉండేవి. ప్రధానంగా అనంతపురం నగరంతో పాటు ధర్మవరం, గుంతకల్లు, శింగనమల, గోరంట్ల, కళ్యాణదుర్గం, హిందూపురం, కదిరి వంటి ప్రాంతాల్లో తమ కార్యక్రమాలను నిర్వహించాయి. అయినా చాలా మందికి వినియోగదారుల చట్టాలపై అవగాహన లేకపోవడం, సరైన ఆధారాలు అందుబాటులో ఉంచుకోకపోవడంతో నష్టపోతున్నారు. వినియోగదారుల అవగాహన లేమి.. వ్యాపారుల స్వార్థం కారణంగా విపణిలో అడుగడుగునా మోసపోతున్న సామాన్యుడికి అండగా జిల్లా కోర్టు ఆవరణలో వినియోగదారుల ఫోరం నడుస్తోంది.

మచ్చుకు కొన్ని విజయాలు...

- 2017లో బుక్కరాయసముద్రం మండలం రేగడి కొత్తూరుకు చెందిన 70 మంది రైతులు నూజివీడు విత్తన కంపెనీ విడుదల చేసిన శ్రేష్ట రకం మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి పంట సాగు చేపట్టారు. అయితే పంట దిగుబడి లేక నష్టపోవడంతో అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రంగంలో దిగిన మండల వ్యవసాయాధికారితో పాటు శాస్త్రవేత్తలు పొలాలను సందర్శించి విత్తనాల్లో లోపం వల్లే పంట నష్టం జరిగినట్లు నివేదిక ఇచ్చారు. దీంతో 2019 వరకు 69 మంది రైతులు విడివిడిగా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. నోటీసులు అందుకున్న కంపెనీ, డీలర్లు తమ వాదన వినిపించారు. విచారణ అనంతరం విత్తనలోపం వల్లే పంట నష్టం జరిగినట్లుగా వినియోగదారుల బెంచ్ అభిప్రాయపడింది. దీంతో ఎకరాకు 23 క్వింటాళ్ల దిగుబడి నష్టంగా పరిగణిస్తూ క్వింటాకు రూ.1,800 చొప్పున సాగు చేసిన విస్తీర్ణానికి లెక్క వేసి రైతులకు పరిహారాన్ని విత్తన కంపెనీ చెల్లించింది.
- తాడిపత్రికి చెందిన బ్రహ్మానందరెడ్డి... కారు కొనుగోలు చేసిన సమయంలో చోళ ఎంఎ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలో బీమా చేయించారు. అలాగే వ్యక్తిగత ప్రమాద బీమా కింద యజమానితో పాటు డ్రైవర్‌కు రూ.15 లక్షలు వర్తించేలా రూ.3,985 ప్రీమియం చెల్లించారు. పాలసీ అమలులో ఉన్న 2020, మార్చి 11న కారు టైర్ పేలిపోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బ్రహ్మానందరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భర్త మృతికి పరిహారంగా వ్యక్తిగత ప్రమాద బీమా కింద రూ.15 లక్షలు చెల్లించాలన్న శ్రీవాణి అభ్యర్థనను బీమా సంస్థ తిరస్కరించింది. దీంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆమె ఆశ్రయించారు. బీమా సంస్థ ప్రతినిధులు హాజరై తమకు ధ్రువీకరణ పత్రాలు అందని కారణంగా ఫిర్యాదు చెల్లదని వాదనలు వినిపించారు. విచారణ అనంతరం సేవాలోపంగా పరిగణిస్తూ ఫిర్యాదు దాఖలు చేసిన తేదీ నుంచి ఆరు శాతం వడ్డీతో సహా రూ.15 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా పరిహారం, సేవాలోపానికి, మనో వేదనకు గురిచేసినందుకు రూ.10 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5 వేలను చెల్లించాలని వినియోగదారుల ఫోరం తీర్పు వెలువరించింది.
- హిందూపురానికి చెందిన శశికుమార్ 2017లో ఎల్‌ఐసీలో మూడు పాలసీలు తీసుకున్నారు. 2020లో శశికుమార్ కరోనా బారినపడ్డారు. అనంతరం గుండెపోటుతో మరణించారు. పాలసీకి నామినీగా ఉన్న మృతుడి భార్య మాలతి తనకు పరిహారం చెల్లించాలని ఎల్‌ఐసీని కోరారు. పాలసీదారుడు తనకు బీపీ, షుగర్ వ్యాధులు ఉన్నట్లు వెల్లడించకుండానే పాలసీ పొందాడనే కారణంగా పరిహారం చెల్లింపు సాధ్యం కాదని ఎల్‌ఐసీ వాదనలు వినిపించింది. దీంతో బాధితురాలు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం పాలసీదారు నిబంధనలను అతిక్రమించలేదని రుజువు కావడంతో రూ.95 లక్షల పరిహారం నామినీకి ఇవ్వాలని తీర్పు వెలువరించారు.

అవగాహన లేదు



వినియోగదారులకు రక్షణ కల్పించడానికి అనేక చట్టాలు అందుబాటులో ఉన్నాయి. కానీ చాలా మందికి వీటిపై అవగాహన లేక వస్తు సేవల్లో నాణ్యత లేకున్నా మౌనంగానే భరిస్తున్నారు. వాణిజ్య పద్ధతులు, లోపభూయిష్టమైన వస్తు సేవలు, జీవితానికి ప్రమాదకరంగా మారే ఉత్పత్తులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.

– శ్రీనివాసులు, విజిలెన్స్ కమిటీ సభ్యుడు

అందుబాటులో హెల్ప్‌డెస్క్



చాలా మంది వినియోగదారులు అవగాహన లేక నష్టపోతున్నారు. లక్షల మంది జనాభాలో కేవలం వందల సంఖ్యలో మాత్రమే కేసులు దాఖలు కావడమే ఇందుకు నిదర్శనం. వినియోగదారులకు హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశాం. నష్టపోయామని భావించిన ప్రతి ఒక్కరూ సరైన ఆధారాలతో నిర్భయంగా మమ్మల్ని సంప్రదించవచ్చు.

– ఎం. శ్రీలత, వినియోగదారుల ఫోరం కమిషన్ చైర్‌పర్సన్

కులం పేరుతో దూషిస్తున్నాడు

- పోలీసు స్పందనలో గిరిజనుల ఆవేదన
- ‘పోలీసు స్పందన’కు 50 వినతులు



అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు వద్ద సమస్య వివరిస్తున్న బంజారా నాయకులు

పుట్టపర్తి టౌన్: స్థానిక ప్రశాంతి గ్రామం వద్ద నివాసముంటున్న టీడీపీ నేత గజ్జల వెంకట్రాముడు తమను రోజూ కులం పేరుతో దూషిస్తున్నాడంటూ బంజారా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులును కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. అధిక వడ్డీ వ్యాపారం సాగిస్తున్న వెంకట్రాముడు కొన్ని రోజులుగా సుగాలీవాళ్లు కనబడితే కులం పేరుతో తిట్టడాన్ని దినచర్యగా పెట్టుకున్నాడన్నారు. తాము ఎలాంటి బాకీ లేకున్నా... ఆయన బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాడన్నారు. డబ్బు ఇవ్వకుంటే కులాన్ని కించపరుస్తూ దుర్భాషలాడుతున్నాడన్నారు. అంతే కాకుండా రియల ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా ఎయిర్ పోర్టు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమి మూడు సెంట్లు ఆక్రమించి ఆ స్థలాన్ని అమాయకులైన గిరిజనలుకు రూ.11 లక్షలతో అంటగట్టాడన్నారు. విద్యుత్ కార్యాలయం వద్ద పడమటి భాగంలో ఉన్న 25 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి చాలా కాలంగా నుందాదాగిరి చేస్తున్నాడన్నారు. బంజారాలను కులం పేరుతో దూషించడమే కాకుండా దాదాగిరీ చేస్తూ డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న వెంకట్రాముడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన అడిషనల్ ఎస్పీ... సమస్యను పరిశీలించి తప్పకుండా న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 50 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా కొన్ని వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధింత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

- రూ.18 లక్షల విలువైన బంగారు నగల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రత్న



స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న ఎస్పీ రత్న

హిందూపురం అర్బన్: స్థానిక వన్‌టౌన్, టూటౌన్, అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన ఏడు చోరీ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి, రూ.18 లక్షల విలువైన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. వివరాలను సోమవారం మధ్యాహ్నం రెండో పట్టణ పోలీస్ స్టేషనలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాలనాయుడు, అబ్దుల్ కరీం, సి.ఆంజనేయులుతో కలసి ఆమె వెల్లడించారు.

వ్యసనాలకు బానిసలై...

హిందూపురంలోని రహమత్‌పుర ప్రాంతానికి చెందిన ఎస్ అల్లాబకాష్, ఆయన అనుచరుడు సయ్యద్ నూరుల్లా, గుడ్డం ప్రాంతానికి చెందిన కావడి నాగేంద్ర, ప్రవీణ్, చాకలి శీను వ్యసనాలకు బానిసలు. తమ వ్యసనాలు తీర్చుకునేందుకు సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీలను ఎంచుకున్నారు. ఈ క్రమంలో కొంత కాలంగా హిందూపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో తాళం వేసిన ఇళ్లను పగటి పూట గుర్తించేవారు. రాత్రి సమయంలో తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి విలువైన బంగారు నగలు, నగదు, ఇతర సామగ్రిని అపహరించేవారు. అనంతరం చోరీ సొత్తును విక్రయించగా వచ్చిన డబ్బును సమానంగా పంచుకుని జల్సాలు చేసేవారు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన చోరీ కేసుల్లో లభ్యమైన వేలిముద్రలు అల్లాబకాష్, సయ్యద్ నూరుల్లా గతంలో దొంగతనాలకు పాల్పడిన కేసుల్లో వేలి ముద్రలకు సరిపోవడంతో సోమవారం ఆటో నగర్ క్రాస్ వద్ద అరెస్ట్ చేశారు. విచారణలో చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి వద్ద గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన నిందితులు కావడి నాగేంద్ర, ప్రవీణ్‌కుమార్, చాకలి శ్రీనివాసులు బాగస్వామ్యం ఉన్నట్లు గుర్తించారు. వీరిని త్వరలో అరెస్ట్ చేయనున్నారు. పట్టుబడిన నిందితుల నుంచి 197 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. అలాగే తూముకుంట చెక్ పోస్టులోని ఓ రెస్టారెంట్‌లోని క్యాష్ కౌంటర్‌లో 37 గ్రాముల బంగారు నగలు ఉంచిన బ్యాగ్‌ను చోరీ చేసిన కేసులో హిందూపురంలోని విద్యానగర్‌కు చెందిన ఆర్.భువనేశ్వరిని అరెస్ట్ చేసి బ్రాస్‌లైట్, రింగులు, కమ్మలు, జుంకీలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఏఎన్ఎం ఆత్మహత్యాయత్నం

పరిగి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని పైడేటి గ్రామానికి చెందిన ఏఎన్ఎం తేజావతి ఆత్మహత్యాయత్నం చేసింది. అదే గ్రామానికి చెందిన ఆశా వర్కర్ గీతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కవిత, తేజావతి మధ్య విధుల నిర్వహణ విషయంగా తలెత్తిన వివాదం తారాస్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తనపై వేధింపులు ఆపాలంటూ ఆశావర్కర్ గీతమ్మ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఏఎన్ఎం తేజావతి అబెట్ ద్రావణాన్ని తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే పరిగిలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రంగడు యాదవ్ ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ హసీనా సుల్తానా సమక్షంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు సమావేశమై చర్చించారు.

గంజాయి ముఠా అరెస్ట్

- 3 కిలోల గంజాయి, కారు సీజ్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ మనోహర్.. చిత్రంలో స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు

గుంతకల్లుటౌన్: ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి రైలు ద్వారా అక్రమంగా గంజాయిని దిగుమతి చేసుకుని..దాన్ని కారులో కర్ణాటక రాష్ట్రం బళ్లారికి తరలిస్తున్న నలుగురు నిందితులను గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి మూడు కిలోల గంజాయి, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బి.మనోహర్ వివరాలు వెల్లడించారు. బళ్లారి నగరానికి చెందిన గంగారాము, రాచకొండ వెంకటసాయి, చెత్రగుడి రామక్రిష్ణ, గుంతకల్లు షికారీకాలనీకి చెందిన షికారీ దుర్గేష్ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నారు. వెంకటసాయి భువనేశ్వర్ నుంచి గంజాయిని రైలులో అక్రమంగా తెప్పించి.. దానిని బళ్లారి, గుంతకల్లుకు చెందిన విక్రేతలకు అమ్ముతున్నాడు. వన్‌టౌన్ పోలీసులకు వచ్చిన పక్కా సమాచారం మేరకు సోమవారం ఉదయం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. నలుగురు నిందితులు క్విడ్ కారు (కేఏ36ఎన్9280) లో గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరిని వన్‌టౌన్ పీఎస్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు. ఒడిశాలో కిలో రూ.5 వేల ప్రకారం కొనుగోలు చేసి.. ఇక్కడికి తీసుకువచ్చిన తరువాత 5 గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నట్లు నిందితులు తెలిపారు. అనంతపురం కోర్టులో హాజరుపరిచిన అనంతరం వారిని రిమాండుకు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జయప్రకాష్ రెడ్డి, సిబ్బందికి సీఐ కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన ఇంజినీరింగ్ విద్యార్థులు

అనంతపురం: గంజాయి సేవిస్తూ పలువురు ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులు పోలీసులకు పట్టుబడ్డారు. రోజూ సాయంత్రం గంజాయి మత్తులో జోగుతున్న విద్యార్థులను గమనించిన పోలీసులు సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. వీరిలో అనంతపురంలోని ఐదు కళాశాలలకు చెందిన పది మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎస్పీ జగదీష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లల ప్రవర్తన ఎలా ఉందనే అంశాన్ని పసిగట్టలేకపోవడం తల్లిదండ్రుల తప్పిదంగా భావించాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి విక్రయిస్తున్న వారితో సంబంధాలు ఉన్నప్పటికీ భవిష్యత్తు దృష్ట్యా హెచ్చరికతో వదిలేస్తున్నామని, పునరావృతమైతే మాత్రం కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని విద్యార్థులను హెచ్చరించారు. కళాశాల యాజమాన్యాలకు కూడా ఇదే చివరి హెచ్చరిక అన్నారు. గంజాయి సేవిస్తూ విద్యార్థి పట్టుబడితే ఆ కళాశాల నిర్వాహకులపై కేసులు పెడతామని హెచ్చరించారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత ‘లేపాక్షి’



పతకాలను చూపుతున్న లేపాక్షి ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

లేపాక్షి: ఆర్డీటీ సౌజన్యంతో గత మూడు నెలలుగా జరుగుతున్న ఉమ్మడి అనంతపురం జిల్లా ఫుట్‌బాల్ టోర్నీ అండర్–12 చాంపియన్ షిప్‌ను లేపాక్షిలోని ఓరియంటల్ ఉన్నత పాఠశాల బాలికల జట్టు కైవసం చేసుకుంది. అలాగే అండర్–16 విభాగంలో పులమతి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారు.

చీనీచెట్ల నరికివేతపై కేసు నమోదు

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం గ్రామంలో జనసేన పార్టీ నాయకులు కర్రు రమణారెడ్డి సాగు చేసిన చీనీ చెట్లను నరికి వేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. సోమవారం పుట్టపర్తి నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఆధారంగా నిందితుల ఆచూకీని పసిగట్టేందుకు ప్రయత్నించామన్నారు. క్లూస్ టీం సేకరించిన వేలిముద్రల ఆధారంగా ముగ్గురు అనుమానితులను గుర్తించామన్నారు.

యువకుడి హత్య



హతుడు వంశీకుమార్

తాడిపత్రి రూరల్: మండలంలోని రావివెంకటాంపల్లి వద్ద ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. తాడిపత్రి అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధరరెడ్డి తెలిపిన మేరకు... రావివెంకటాంపల్లికి చెందిన వంశీకుమార్ (26) ఐచర్ వాహన క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం వాహనం బాడుగ విషయంగా తేడాలు రావడంతో తోటి డ్రైవర్లు, క్లీనర్లతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గ్రామ శివారులోని కంపచెట్ల వద్ద బలమైన గాయాలతో విగతజీవిగా కనిపించాడు. తలతో పాటు ఇతర చోట్ల బలమైన గాయాలు ఉన్నాయి. గతంలో వంశీకుమార్‌తో గొడవ పడినవారే ఇందుకు కారకులంటూ బాధిత కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో గతంలో హతుడితో గొడవపడిన డ్రైవర్లు, క్లీనర్లను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రశాంతి నిలయం వేదికగా క్రిస్మస్ పర్వదిన వేడుకలు సోమవారం సాయంత్రం అంబరాన్ని అంటాయి. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చిన్నారులు ప్రదర్శించిన ఇమ్మానుయేల్, గాడ్ విత్ అస్ నాటికలు ఆకట్టుకున్నాయి. క్రీస్తు భిక్షులపై చూపిన కరుణను నాటిక ద్వారా వివరించారు. – ప్రశాంతి నిలయం:



సత్యసాయిని స్తుతిస్తూ గానం చేస్తున్న కళాకారులు





ఇమ్మానుయేల్ నాటికలోని సన్నివేశాలు